క్లుప్తంగా

ఇద్దరు జూదరుల అరెస్టు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం అప్పారావుపేటలో పేకాట ఆడుతున్న వారిపై బుధవారం చేబ్రోలు పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిని కోర్టుకు హాజరుపర్చినట్టు పోలీసులు తెలిపారు.

అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలి

ఏలూరు (టూటౌన్) : జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరు మండలాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను ఆపాలని, దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యనాయకుల సమావేశం పి.ఆనందరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా, అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చెరువల తవ్వకాల వల్ల తాగు నీరు కలుషితమైపోతుందని, పంట చేలు చౌడు బారుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆక్వా చెరువులు తవ్వుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాన్ రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కుల సంఘాల రిజిస్ట్రేషన్ల విషయంలో రజక వృత్తిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రజక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో రజక వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. జిల్లాలు విడిపోవడం వల్ల కొన్ని గ్రామాలు మారి రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది ఎదురౌతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు రిజిస్ట్రేషన్ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రజకుల చెరువులను సర్వే చేయించి హద్దు నిర్ణయించాలని, పాడైపోయిన రజక విశ్రాంతి భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రజక నేతలు వితాల శ్రీనివాసరావు, కడెల్లి సుబ్బయ్య, కవులూరి సూర్య చంద్రం, కోటిచుక్కల అప్పారావు, టేకు కృష్ణవేణి, కొండపల్లి సత్యనారాయణ, దువ్వాపు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో తలసేమియా చిన్నారులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారికి ప్రత్యేకంగా అందించాల్సిన చికిత్సను రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తోందని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది చిన్నారులకు తలసేమియా రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టు మాణిక్యాలరావు, సభ్యులు పద్మజ, డీసీఎస్ మల్లేశ్వరరావు, సీహెచ్ అవినాష్ తలసేమియా చిన్నారులను పరామర్శించారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. తలసేమియా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రి, సహాయకులు 30 మందికి మానవత విద్యనిధి, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజన సదుపాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలో బుధవారం మొహర్రం వేడుకలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్ కర్బలా యుద్ధంలో అమరుడైన రోజును ముస్లింలు అత్యంత పవిత్రమైన దినంగా పరిగణించి మొహర్రం వేడుకలను నిర్వహించుకుంటారు. ఇదే రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభ శుభ దినం కూడా కావడంతో స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ మహాత్ముని ఆస్థాన (గొలుసుల పంజా)లో తొలుత అత్తర్ నమాజ్ నిర్వహించారు. అనంతరం మౌలా అలీ మహాత్ముని పేరిట పీర్లు నిలబెట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దరూద్ సలాం, ఫాతెహా ఖానీ నిర్వహించి షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్య ఖుర్ఆన్ గ్రంథ పఠనం చేసి భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమలె సున్నత్ వల్ జమాత్ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు


ఉంగుటూరు: కైకరం సభలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: అర్హతే ప్రామాణికంగా కుల,మతాలకు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. బుధవారం ఉంగుటూరు మండలం కైకరం- 1, 2 సచివాలయాలు వద్ద జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. ఈ సభలకు ఉపసర్పంచి మట్టా మురళి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొని మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్టు తెలిపారు. సచివాలయ వ్యవస్థల ద్వారా పాలన ప్రజల ముందుకు వచ్చిందన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్టు వాసుబాబు వివరించారు. డీఎల్‌డీవో వెంకటరమణ, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దారు వెంకటరమణ, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఉప సర్పంచి మట్ట మురళి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావుబాబ్జి, కొరిపల్లి శ్రీనువాసరావు, రవి, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. సురక్ష సభల ద్వారా 1,093 సర్టిఫికెట్లు ప్రజలకు పంపిణీ చేశారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శం

పెదపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శనీయంగా నిలిచిందని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రులో జగనన్న సురక్ష పథకంలో భాగంగా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు మరింత మందికి అందించేందుకే జనగన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు వాటినే అమలు చేస్తానని చెబుతున్నాడని ప్రజలు ఆయన మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలు సమీపించడంతో ప్రజల దగ్గరకు ప్రతిపక్ష నేతలు వచ్చి కల్లబొల్లి కబుర్లు చెబుతారని వారిని నమ్మవద్దని హితువు పలికారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేసారు. అనంతరం చెరువు గట్టుపై మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి, జయపురం సర్పంచ్ ఘంటసాల బేబీసరోజ, స్థానిక నాయకులు బత్తుల ఏసురాజు, మెడబలిమి సంతోష్‌కుమార్, కొండే లాజరు, ఘంటసాల మోషే, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, స్థానిక ఎంపీడీవో ఎస్ నిర్మల జ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, డాక్టరు వాణీ సంధ్య, ఏపీఎం దాసరి సుమలత పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గొప్ప కార్యక్రమం

దెందులూరు: జగనన్న సురక్ష గొప్ప కార్యక్రమమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, దెందులూరు మండల సచివాలయ కన్వీనర్లు కట్టా ఏసుబాబు అన్నారు. బుధవారం రామారావుగూడెంలో సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎస్ఎస్ కృపావరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ప్రజలందరీ మేలు కోసమే జగనన్న సురక్ష అమలు చేస్తున్నారని అన్నారు. అనంతరం 32 ధ్రువీకరణ పత్రాలను సర్పంచ్ శ్రావణి సుధీర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇశ్రాయేలు, ముప్పవరం సర్పంచ్ మెండేం సంతోష్‌కుమార్, ప్రత్యేకాధికారి కృపావరం, అసిస్టెంట్ ఇంజనీర్లు రాజేంద్ర, చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ సీనియర్ నాయకులు పర్వతనేని నరేంద్ర, పీ.బాబ్జి, తేరం ప్రసాద్, కొత్తపల్లి సుబ్బారావు తదితరులున్నారు. ముప్పవరం పంచాయతీలో సర్పంచ్ మెండేం సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 14 ధ్రువీకరణ పత్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపసర్పంచ్ ముకుంద, లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు.


పెదపాడు: పాతముప్పర్రులో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్


దెందులూరు : రామారావుగూడెంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి కృపావరం, ప్రజాప్రతినిధులు

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు



వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా పనిచేస్తున్నారు. వారి సేవలు శ్లాఘనీయం. ప్రతి రోజు తమకు కేటాయించిన ఇళ్లలో ఎవరికి ఏ అవసరమున్నా కుటుంబసభ్యునిలా సేవలందిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారు. ఒకటో తేదీన 5 గంటలకే తలుపు తట్టి పింఛన్లు అందిస్తున్నారు. కరానా సమయంలో ఇంటింటికీ తిరిగి ఆప్యాయంగా పలకరించి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుని సహాయ సహకారాలు అందించారు.

– మెడబలిమి సంతోష్‌కుమార్ మాజీ సర్పంచ్ పాతముప్పర్రు

వలంటీర్లకు మా మద్దతు



దెందులూరు: రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది వలంటీర్లు వారి కుటుంబ సభ్యులు, బంధువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మరోసారి ఎవరు మాట్లాడినా, దూషించినా బహిరంగంగానే ప్రతిఘటిస్తాం. ఆదర్శవంతమైన సేవలందిస్తున్న వలంటీర్లకు, వారి కుటుంబ సభ్యులకు గౌడ సంఘం పూర్తి మద్దతు ఉంటుంది. పవన్‌కల్యాణ్, చంద్రబాబు వలంటీర్లను విమర్శించడం, కించపరచడం, దుర్మార్గం, అత్యంత నీచమైన పని. రాజకీయాల్లో ఉనికి కోసం సేవలందించే వారిపై విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– అచ్యుతగౌడ్, గౌడ సంఘ జిల్లా నాయకులు

డెస్కుల ఏర్పాటుపై విద్యార్థుల హర్షం


నూతనంగా ఏర్పాటు చేసిన డెస్కులపై కూర్చున్న విద్యార్థులు

పెదవేగి : పెదవేగి మండలం రాయన్నపాలెం పంచాయతీ లేల్లగూడెం పాఠశాల్లో డెస్కుల ఏర్పాటుపై విద్యార్థుల హర్షం వ్యక్తం చేశారు. పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన ఆయన విద్యార్థులకు డెస్కులు వచ్చినప్పటికీ బిగించకపోవడం వల్ల పిల్లలందరూ కింద కూర్చోవడం గమనించారు. వెంటనే స్పందించిన ఎంపీడీఓ డెస్కులు బిగించమని ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం పిల్లలకు ఉపయోగపడేలా డెస్కులు బిగించారు. విద్యార్థులకు డెస్కుల ఏర్పాటుపై సంబంధిత ఉపాధ్యాయులను ఎంపీడీఓ అభినందించారు.

ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోండి


కొండలరావుపాలెంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెదవేగి : సుదీర్ఘకాలంగా పూర్తికాని ప్రభుత్వ పనులు రోజుల వ్యవధిలో గ్రామానికి వచ్చి ఉచితంగా అందించడం గొప్ప విషయమని కొండలరావుపాలెం సర్పంచ్ పాలడుగు సత్యవతి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కొండలరావుపాలెంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన ఉచిత సర్వీసులతో భాగంగా ఆదాయ, కుల, సీసీఆర్‌సీ, అడంగల్, 1బి సర్వీసులకు సంబంధించి 1066 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు నాయకులు అందించారు. గ్రామ ప్రజలు అందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తహసీల్దార్ తెలియజేశారు. అనంతరం నాయకులందరు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొండలరావుపాలెం సర్పంచ్ పాలడుగు సత్యవతి, విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ దేవళ్ళరాజు రాధిక రాజశేఖర్, వార్డు మెంబర్లు, ఈఓఆర్డీ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామశింగవరంలో...

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించే ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. బుధవారం మండలంలోని రామశింగవరంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలు ఎవరికైనా అందకుండా ఉంటే అవి కూడా అందే విధంగా చర్యలు చేపట్టనున్నట్టు ఆమె అన్నారు. అనంతరం ప్రజల అభ్యర్థన మేరకు మంజూరైన ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి


వట్లూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ మెంబరు జీ దేవి తదితరులు

పెదపాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల్లో పోషణ లోపాన్ని నివారించేందుకు, రక్త హీనతను తగ్గించేందుకు ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని అందరికీ అందేలా కృషి చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబరు జీ దేవి సూచించారు. బుధవారం పెదపాడు ఐసీడీఎస్ పరిధిలోని వట్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. పిల్లలు ఎత్తు బరువు రికార్డులను పరిశీలించారు. లోప పోషణ గల పిల్లలపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు అమలు జరుగుతున్న విధానాన్ని పిల్లల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కిట్‌లు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీసారు. మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరక్టరు పద్మావతి అదనపు సీడీపీఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలి

దెందులూరు: అలుగులగూడెం- దెందులూరు మధ్య ఉన్న అండర్ పాస్ నిర్మిస్తున్న నేపథ్యంలో ఆ మార్గం గుండా వెళ్లే అన్ని గ్రామాల ప్రజల ప్రయాణ అవసరాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైల్వే కాంట్రాక్టర్‌ను తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య ఆదేశించారు. బుధవారం వర్షం కారణంగా ఏర్పడిన బురదలో వివిధ గ్రామాల ప్రజలు, వృద్ధులు, విద్యార్థులు ప్రయాణానికి పడుతున్న ఇబ్బందులను అలుగులగూడెం వార్డు మెంబరు ప్రసన్నరాణి, రాణి, తదితరులు తహసీల్దార్‌కు వివరించారు. వెంటనే తహసీల్దార్ రైల్వే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి ప్రస్తుతం ఉన్న రోడ్డు ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేగవంతంగా అండర్‌పాస్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పద్మశాలీల సంఘ సభ్యుల సమావేశం

ఉంగుటూరు: వచ్చేనెలలో భీమడోలులో నిర్వహించనున్న పద్మశాలీల సంఘ నియోజకవర్గ మహాసభను జయప్రదం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా సంఘం నాయకుడు, రాష్ట్ర వర్కింగు అధ్యక్షుడు వానపల్లి నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపురంలో ఉంగుటూరు నియోజకవర్గం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామం వెళ్లి చేనేత కార్మికుల్లో చైతన్య నింపాలని కోరారు. మండలాలకు బాధ్యులను నియమించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు, వానపల్లి ప్రసాదు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులు


గొల్ల రత్నహారిక


ఎ. ఈనోష్


పీ.సత్యసాయి వంశీ


చార్లెస్ వెస్లీ

దెందులూరు: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా బాలికలు, బాలుర జట్టుకు కొవ్వలి ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు ఎంపికయ్యారని ఎస్ఎస్ఎల్‌వీజీ శర్మ అన్నారు. బుధవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీల్లో ఆడేందుకు పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టుకు గొల్ల రత్నహారిక ఎంపికైందన్నారు. బాలుర జట్టుకు ఏ. ఈనోష్, పీ.సత్యసాయి వంశీ, ఈ.చార్లెస్ వెస్లీ ఎంపికయ్యారన్నారు. జిల్లా జట్టుకు తమ పాఠశాలకు చెందిన నలుగురు ఎంపిక కావడం, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను హెచ్ఎంశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

మండలాధికారుల అభినందన : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టుకు ఎంపికైన కొవ్వలి హైస్కూల్ విద్యార్థులు, ప్రోత్సహించిన హెచ్‌ఎం శర్మ, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాస్‌ను ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అభినందించారు.

చిన్నారి మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

బాధ్యులను సస్పెండ్ చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్


ఆసుపత్రి వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు


చిన్నారి మృతదేహం

భీమడోలు: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా నాలుగేళ్ల చిన్నారి బుధవారం రాత్రి మృతి చెందిందని తల్లిదండ్రులు, అర్జావారిగూడెం గ్రామస్తులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంకు చెందిన అంగులూరి చిన్నారి (4) అనే బాలిక మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉదయం వారి తల్లిదండ్రులు చేర్పించారు. రాత్రి ఒక్కసారిగా వైద్యం వికటించి చిన్నారి కుప్పకూలిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలిక చనిపోయిందని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి వద్ద రాత్రి బైఠాయించి ఆందోళన చేస్తున్నారు. చిన్నారి మృతికి కారణమైన వైద్యుడిని సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రాత్రి 10.30 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనితో అక్కడ ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ తన సిబ్బందితో ఆసుపత్రికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని వారిని కోరినా ఫలితం లేకుండాపోయింది. చిన్నారి మృతికి వైద్యు డి నిర్లక్ష్యమే కారణమంటూ బాలిక తండ్రి వినోద్‌కుమార్ రోధిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారని ఆందోళన విరమించాలని ఎస్సై వారిని వారిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ చిన్నారిని భీమడోలు ఆస్పత్రికి తీసుకు వచ్చేటప్పటికే గ్రామీణ వైద్యుల వద్ద ఆమెకు చికిత్స అందించారని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతికి కారణాలు తెలుస్తాయని ఆమె అన్నారు.

భారీ వర్షం.. వ్యవసాయ పనులు ముమ్మరం


బొమ్మిడి ఆయకట్టులో దమ్ము చేస్తున్న దృశ్యం


గుమ్మిడిగుంట వద్ద రోడ్డుపై వర్షపు నీరు

ఉంగుటూరు: వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి. మంగళవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఫలితంగా వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి. మండలంలో ఈ ఏడాది 26,457 ఎకరాల్లో సాగు జరగనుంది. ఈమేరకు యాభై శాతం నాట్లు పూర్తయ్యాయి. మిగిలిన యాభై శాతం నాట్లకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ఉపయోగపడనుంది. నీరందని శివారు భూములకు వర్షం దోహదపడనుంది. ఈ ఏడాది స్వర్ణ, సంపద స్వర్ణ, 1,121 రకం, పీఎల్ ఎ 1,121 రకం, ఎస్ఎల్ 10 రకం, పీఆర్ 120 రకం, నాట్లు ఈఏడాది ఎక్కువగా రైతులు నాటుతున్నారు. దీనికి సంబంధించి నారుమడులు తయారయ్యాయి. దీంతో నాట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మెట్ట డెల్టా, కొల్లేరు తీర ప్రాంత భూములు మండలంలో విస్తరించి ఉన్నాయి. దాంతో మండలంలో సాగు జరిగే పనుల్లో రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమై పనిచేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికార్లుకూడా పొలంబడి నిర్వహిస్తూ రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తున్నారు. రైతులను చైతన్యపరుస్తున్నారు. దాంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, ఏడీఏ ఉషారాజకుమారి మండలంలో రైతులకు పొలంబడి ద్వారా రైతులకు సమావేశాలు నిర్వహించి వ్యవసాయంలో మెళకువలు తెలియజేస్తున్నారు.

ఆహ్లాదాన్ని కలిగించిన తొలకరి చినుకులు

పెదవేగి : నియోజకవర్గ పరిధిలో బుధవారం వీచిన ఈదురుగాలులకు తోడు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి పలు డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. తెల్లవారుజామున 3 గంటల నుంచి ప్రారంభమైన గాలి ఈదురుగాలులను తలపించింది. ఇదిలా ఉంటే వర్షంలో వాహనచోదకులు తడుచుకుంటూ గొడుగులు వేసుకుని, కవర్లు కప్పుకుని గమ్యస్థానాలు చేరుకున్నారు. వేగంగా ఈదురుగాలులు వీయడంతో మండల పరిధిలో పలుచోట్ల చెట్ల కొమ్మలు, విరిగి పడ్డాయి. భారీ వర్షం కురవడంతో పలుచోట్ల డ్రెయినేజీల్లోని నీరు శివారుకు వెళ్లకపోవడంతో రోడ్ల పైకి చేరింది. ఈ వర్షం సాగుకు ఎంతగానో ఉపకరిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కాగుపాడు ఆయకట్టులో ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న దృశ్యం


పొలంబడిలో రైతులకు సూచనలు సలహాలు అందజేస్తున్న ఏడీ ఏ ఉషారాజకుమారి, ఏవో బాలిన వెంకటేష్ (ఫైల్)

ఐటీడీఏ వద్ద ఆదివాసీ గిరిజనుల ధర్నా

బుట్టాయగూడెం : గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములకు పట్టాలివ్వాలని కోరుతూ బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, మంతెన సీతారామ్, వినతిపత్రాన్ని ఐటీడీఏ పీఓ జీవీవీ సత్యనారాయణకు అందజేశారు.